క్లుప్తంగా

ఎమ్మెల్యే పర్యటన



మృతుడి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ

ఇల్లెందురూరల్: బొజ్జాయిగూడెం గ్రామపంచాయతీలో శనివారం ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ పర్యటించారు. రహదారులను పరిశీలించారు. నిధులు మంజూరైన పనులను వెంటనే ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామంలో ఇటీవల మృతి చెందిన చీమల బుచ్చమ్మ, ఈసాల ముత్తయ్య కుటుంబాలను పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా దరఖాస్తు



దరఖాస్తు సమర్పిస్తున్న లక్ష్మణ్ అగర్వాల్

చుంచుపల్లి: కొత్తగూడెం బీజేపీ అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలని పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్ అగర్వాల్ శనివారం హైదరాబాద్‌లోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో దరఖాస్తు సమర్పించారు. కొత్తగూడెం జనరల్ స్థానానికి గాను తనకు టికెట్ కేటాయించాలని ఆయన రాష్ట్ర పార్టీ పెద్దలను అభ్యర్థించారు. నియోజకవర్గంలో నిత్యం పార్టీ అభివృద్ధికై శ్రమిస్తున్న తనకు పార్టీ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలని రాష్ట్ర కమిటీని కోరినట్లు తెలిపారు.

పాల్వంచరూరల్: కొత్తగూడెం అసెంబ్లీ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థిగా పాల్వంచ మండలం పాండురంగాపురం గ్రామానికి చెందిన దాసరి రమేష్ శనివారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. పార్టీ అవకాశం కల్పిస్తే నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి ఈ ప్రాంతంలో రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు.

మౌలిక వసతులు కల్పించండి

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని రామవరంలో సుమారు ఎనిమిదేళ్ల క్రితం రూ.45 లక్షల ఖర్చుతో కమ్యూనిటీ హాల్ నిర్మించారు. కానీ కనీస సౌకర్యాలు విస్మరించారని, కనీసం మీరైనా వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజుకు ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ శనివారం వినతిపత్రం అందజేశారు. రజాక్ మాట్లాడుతూ.. కమ్యూనిటీ హాల్‌లో ప్రధానంగా డైనింగ్ హాల్, వాష్ బేషిన్స్, సీలింగ్ ఫ్యాన్స్, లైటింగ్, ఓపెన్ గ్రౌండ్‌లో స్టేజ్ ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన జీఎం వీలైనంత త్వరలో కమ్యూనిటీ హాల్‌ను పరిశీలించి, చర్యలు తీసుకుంటామని చెప్పారని పేర్కొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

టేకులపల్లి: గ్రామాల్లో సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా తదితర వ్యాధులు ప్రబలకుండా ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా ఎంపీడీఓ కోట వీరబాబు ఆదేశాల మేరకు ఎంపీఓ గణేష్ గాంధీ పర్యవేక్షణలో మండలంలోని 36 గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు శనివారం పారిశుద్ధ్య పనులు చేయించారు. కాలువలు శుభ్రం చేశారు. గుంతలున్న రహదారుల్లో గ్రావెల్ పోశారు. పిచ్చి మొక్కలు, బురద గుంతలు, నీటి నిల్వలను తొలగించారు. బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. అన్ని గ్రామాల్లో ఫాగింగ్ చేసి, దోమల నివారణ మందును పిచికారీ చేశారు.

మధురం.. సీతాఫలం



సీతాఫలం చెట్లు. చెట్టు కొమ్మల మీద, చెట్టు కింద పిల్లల గుంపు. అదిగో.. ఆ కాయ కళ్లు తెరిచింది. ఇదిగో.. ఈ ఆకుల చాటున కాయ పెద్దగా ఉంది కోసెయ్.. తెచ్చి బుట్టలో మాగబెట్టి రెండు రోజులు తరువాత పొద్దున్నే ఇక ఇవే టిఫిన్. ఇది ఒకప్పటి చిత్రం.. పెరడులో, చేలో గట్ల మీద, బావి అంచులకు, బోడు మీద ఉండే సీతాఫలాల చెట్లు ప్రస్తుతం అదృశ్యమై పోయాయి. ఇప్పుడు మార్కెట్‌లో, రహదారుల వెంట తోపుడు బండ్లపై పచ్చగా నిగనిగలాడుతూ అమ్మకానికి ఉంటున్నాయి. వీటి వల్ల ఆరోగ్యకరమైన ప్రయోజనాలు ఉన్నాయని తెలిస్తే తప్పక బండి ఆపి ఓ డజను కొనుగోలు చేస్తారు.

- సీతాఫలాల విక్రయాల జోరు
- డజన్ రూ.300 – 500

సండే స్పెషల్

పాల్వంచరూరల్: సీతాఫలం సీజన్ వచ్చేసింది. పేదల యాపిల్‌గా, మధుర ఫలంగా పేరుగాంచిన సీతాఫలాలు అంటే ఇష్టపడనివారు ఉండరు. చిన్నారుల దగ్గర నుంచి వృద్ధుల వరకు అమితంగా ఇష్టపడే సీతాఫలాలు స్థానిక రహదారులపై అమ్మకానికి ఉన్నాయి. ఈ ఏడాది వర్షాలు అధికంగా కురవడంతో వాతావరణం సీతాఫలాల చెట్లకు అనుకూలంగా ఉంది. దీంతో ఈ ఏడాది విరివిగా కాసాయి. మార్కెట్‌లోకి ఇప్పుడిప్పుడే వస్తున్నాయి. ఏజెన్సీ, పారిశ్రామిక ప్రాంతమైన పాల్వంచ పట్టణ, మండల పరిధిలో వ్యాపారులు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి సీతాఫలాలను తీసుకొచ్చి డజన్ రూ.150 – 200 చొప్పున వ్యాపారులు విక్రయిస్తున్నారు.



దూరప్రాంతాల నుంచి తెచ్చి మార్కెట్‌లో అమ్ముతున్న సీతాఫలాలు

గ్రామీణులకు ఉపాధి...

సీతాఫలాల అమ్మకాలతో గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉపాధి కలుగుతుంది. ప్రతి సంవత్సరం దసరాకు ముందు సీతాఫలాలు పక్వానికి వస్తాయి. దినసరి వ్యాపారులు వాటిని అడవిలోకి వెళ్లి సేకరించి తెచ్చి విక్రయిస్తూ ఉపాధి పొందేవారు అధికంగా ఉన్నారు. ప్రతి సంవత్సరం రోహిణీ కార్తెలో వర్షాలు కురిస్తే అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు సీతాఫలాల దిగుబడి వస్తుంది. ఈసారి వర్షాలు ముందుగానే కురవడంతో సీతాఫలాలు కూడా సెప్టెంబర్‌లోనే వచ్చాయి.

రసాయనాలు వాడని పండ్లు..

మార్కెట్‌లో లభించే అన్ని రకాల పండ్లకు వ్యాపారులు అవి పండు పండేందుకు వివిధ రసాయనాలు వినియోగిస్తారు. కానీ ఒక్క సీతాఫలానికి మాత్రమే ఎలాంటి రసాయనాలు ఉపయోగించరు. ఈ పండ్లకు రసాయనాలు వినియోగిస్తే ఒక్కరోజులోనే కుళ్లిపోతాయి.

పెరిగిన ధరలు..

సీతాఫలాల ధరలు గతంలో కంటే ఈసారి అధికంగా పెరిగాయి. గత ఏడాది సైజును బట్టి డజన్ రూ.100 – 250 విక్రయిస్తే ఈసారి రూ.300 – 500 చొప్పున విక్రయిస్తున్నారు. సీజనల్ పండ్లు కావడంతో వీటిని ఎక్కువ మంది ఇష్టపడుతుంటారు. దీంతో వ్యాపారులు వాటి ధరలను కూడా అమాంతం పెంచుతున్నారు.



పాల్వంచ రోడ్డు పక్కన తోపుడు బండిపై...

ఆరోగ్యప్రదాయిని సీతాఫలం...

సీతాఫలం ఆరోగ్యానికి మంచిందని వైద్యులు కూడా ధృవీకరిస్తున్నారు. ఇవి అత్యంత మధురంగా రుచిలోనే కాకుండా పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. వీటిని తినడం వలన మలబద్ధకం, రక్తహీనత తదితర సమస్యలను విముక్తి లభిస్తుంది. సీతాఫలంలో సీ విటమిన్, కాల్షియం, ఫాస్పరస్, పోటాషియం, మెగ్నీషియం అధికంగా ఉండటంతో జీర్ణ సంబంధిత సమస్యలు కూడ తొలగిపోతాయి. శరీర రక్షణకు కావాల్సిన పోషకాలు వీటిలో ఉండటంతో శీరీరం ధృడంగా, ఆరోగ్యంగా తయారువుతుందని వైద్యనిపుణులు అంటున్నారు.

రాజీ మార్గమే రాజమార్గం..



లోక్ అదాలత్ నిర్వహిస్తున్న దృశ్యం

ఇల్లెందు: క్షణికావేశాల వల్ల సంభవించే ఘర్షణ ద్వారా కోర్టు చుట్టూ తిరిగి సమయాన్ని, ధనాన్ని వృథా చేసుకోవటం కంటే రాజీ పడటమే రాజమార్గంలా ఉంటుందని ఇల్లెందు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రికారెడ్డి అన్నారు. శనివారం ఇల్లెందు కోర్టులో ఆవరణలో జాతీయ లోక్ ఆదాలత్ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ క్షణికావేశంలో జరిగిన సంఘటనలపై అదాలత్‌లో రాజీపడటం సుప్రీంకోర్టు తీర్పుతో సమానమన్నారు. అనువైన కేసుల్లో రాజీ ఒక్కటే రాజమార్గమన్నారు. ఏళ్ల తరబడి కేసులు పెండింగ్‌లో ఉండటం , పరిష్కారం లభించకపోవటం వల్ల కాలం వృథా అవుతుందని భావించిన హైకోర్టు ఈ లోక్‌అదాలత్‌ను తీసుకొచ్చినట్లు చెప్పారు. పల్లెలు అభివృద్ధి చెందాలంటే స్నేహభావం ఉండాలని, పగలు, కక్షలు, కార్పణ్యాలు ఉండటం ఆ పల్లెలు, కుటుంబాలు అభివృద్ధి సాధించలేవన్నారు. ఈ సందర్భంగా పీడీఎం కోర్టులో రెండు సివిల్ కేసులు, మూడు గృహహింస కేసులు, మూడు మనోవర్తి కేసులు, రెండు చెక్ బౌన్స్ కేసులు, 89 పోలీస్ కేసులు, ఏడీఎం కోర్టులో ఎనిమిది పోలీస్ కేసులు, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో 755 ఎస్టీసీ కేసులు మొత్తం 908 పరిష్కరించినట్లు తెలిపారు.

కిన్నెరసాని నీళ్లు 'బురద'మయం

కొత్తగూడెంఅర్బన్: పట్టణ ప్రజలకు కిన్నెరసాని నుంచి వచ్చే తాగునీరు నెల రోజులుగా బురదనీరుగానే వస్తున్నాయని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ఆరోపించారు. శనివారం బూడిద గడ్డ బస్తీలో పట్టణ అధ్యక్షుడు వంగా రవిశంకర్ అధ్యక్షతన జరిగిన పట్టణ కార్యవర్గ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన కామేష్ మాట్లాడుతూ.. కిన్నెరసాని జలాల విషయమై బీఎస్పీ పార్టీ ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. అయినా ఎమ్మెల్యే, మున్సిపల్ పాలకవర్గం , అధికారులు ప్రజల ఆరోగ్యంపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మల్లికార్జునరావు, మాలోత్ వీరు నాయక్, చెనిగారపు నిరంజన్ కుమార్, తాటిపాముల హరికృష్ణ పాల్గొన్నారు.

గిరిజనుల హక్కుల సాధనే లక్ష్యం



మాట్లాడుతున్న భద్రునాయక్

పాల్వంచరూరల్: గిరిజనుల హక్కుల సాధనే లక్ష్యంగా సేవాలాల్ సేన పనిచేస్తుందని సేవాలాల్ సేన జిల్లా ఉపాధ్యక్షుడు గుగులోతు బద్రునాయక్ అన్నారు. మండల పరిధి ఉల్వనూరు లక్ష్మీదేవిపల్లి గ్రామంలో సేవాలాల్‌సేన 9వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాలాల్ సేన జెండాను ఆవిష్కరించి, సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భద్రు నాయక్ మాట్లాడుతూ.. గిరిజనులకు పదిశాతం రిజర్వేషన్లు, 500 జనాభా కలిగిన తండాలను గ్రామపంచాయతీలుగా చేయడంలో సేవాలాల్ సేన ప్రత్యేక భూమిక పోషించిందన్నారు. పోడుభూములకు పట్టాలు ఇప్పించేందుకు పలుపోరాలు చేసిందన్నారు. తండా గ్రామ పంచాయతీలను రెవెన్యూ గ్రామపంచాయతీలుగా గుర్తించాలని, గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇస్లావత్ రాందాస్‌నాయక్, రవినాయక్, బోడా రమేష్‌నాయక్, భిక్షం, గుగులోతు బద్యానాయక్ పాల్గొన్నారు.

స్పాట్ కౌన్సెలింగ్‌ను సద్వినియోగం చేసుకోండి

కొత్తగూడెంఅర్బన్: గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల కొత్తగూడెంలో జరగనున్న స్పాట్ కౌన్సెలింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ బి.రాజేశ్వరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గురుకుల డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్ నిర్వహిస్తున్నట్లు, ఇంటర్ పూర్తి చేసుకున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. వివరాలకు 8106257520, 9951830441 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రేపు ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

కొత్తగూడెంటౌన్: రామవరం 7వ వార్డులోని కొత్తూరి రాజంబస్తీలోని శ్రీపోచమ్మతల్లి ఆలయ నిర్మాణానికి 11వ తేదీన శంకుస్థాపన నిర్వహించనున్నట్లు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. శనివారం ఆలయం వద్ద జరిగిన సమావేశంలో ఆహ్వాన పత్రాలను విడుదల చేశారు. కొత్తూరి చుక్కయ్య, రవికుమార్, ఒడ్డూరి హరిబాబు, పెరిక కిరణ్, నెమ్మెళ్ల రవి, పాటిమోహన్, కొమ్ము కిరణ్, ఇల్లందుల పోషయ్య పాల్గొన్నారు.

పండ్ల మొక్కలు పంపిణీ



మొక్కలు అందజేస్తున్న జీఎం జాన్‌ఆనంద్

ఇల్లెందు: జీఎం కార్యాలయంలో పని చేస్తున్న ఉద్యోగులు, జేకేఓసీ ప్రభావిత గ్రామాల ప్రజలకు ఏరియా జీఎం జాన్ ఆనంద్ చేతుల మీదుగా పండ్ల మొక్కలు పంపిణీ చేశారు. జీఎం మాట్లాడుతూ.. పారిశ్రామిక ప్రాంతంలో విడుదలవుతున్న వ్యర్థాలతో పర్యావరణంలో మార్పులను అధిగమించటానికి ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. ఖాళీ ప్రదేశాలను గుర్తించి, వాటిలో అనువైన మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఓటూ జీఎం మల్లారపు మల్లయ్య, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ పంజాల శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలో ఫ్రెషర్స్ డే



నృత్యం చేస్తున్న విద్యార్థులు

పాల్వంచరూరల్: మండల పరిధి లక్ష్మీదేవిపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, ఆర్థికశాస్త్ర నిపుణులు బండారి రమేష్, పేరెంట్స్ కమిటీ కార్యదర్శి లక్ష్మయ్య, అనిల్‌కుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజలకు ఎల్లప్పుడూ తోడుగా ఉంటా..



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వనమా

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం ప్రజలకు ఎల్లప్పుడూ తోడునీడగా ఉంటానని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డులలో పర్యటించి సుమారు రూ.16 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మాట్లాడుతూ.. తన జీవితాంతం ప్రజలకు సేవ చేయడమే ధ్యేయంగా పరిపాలన సాగిస్తామని, తుదిశ్వాస వరకు ప్రజల మధ్యనే ఉంటానని తెలిపారు. కొత్తగూడెం ప్రజల రుణం తీర్చుకునేందుకు వారి కోసం నిరంతరం పని చేస్తానన్నారు. కొత్తగూడెం నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో ముందంజలో ఉంచడమే తన కర్తవ్యం అన్నారు. త్వరలోనే పేదలకు కొత్తగూడెంలో ఇళ్ల స్థలాల పట్టాలు ఇస్తామని పేర్కొన్నారు. నియోజకవర్గంలో మూడు వేల మందికి గృహలక్ష్మి కింద ఇళ్లు కట్టిస్తామన్నారు. కార్యక్రమంలో వనమా రాఘవేందర్, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్యా రాంబాబు, కౌన్సిలర్లు కాసుల ఉమారాణి, సాహెరబేగం, అంబుల వేణు, బాలిశెట్టి సత్యభామ, రావి మమత, శ్రీనివాసరెడ్డి, రుక్మాంగర్‌బండారి, ధర్మరాజు, ప్రసాద్, కాసుల వెంకట్, యూసఫ్, సుందర్‌రాజు, రావిరాంబాబు, కేకే శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో అధ్వానంగా శానిటేషన్



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్లు

ఇల్లెందు: వార్డులలో శానిటేషన్ అధ్వానంగా తయారైందని, వీధులు అంధకారంలో ఉన్నాయని చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కౌన్సిలర్లు కమిషనర్ కుమారస్వామిని కోరారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జానీ, కౌన్సిలర్లు మాట్లాడుతూ.. పట్టణ ప్రగతి కార్యక్రమం నుంచి స్పెషల్ శానిటేషన్ చేపట్టాలని కోరారు. మున్సిపల్ కార్యాలయంలో మహిళా ఉద్యోగులు, 16 మంది మహిళా కౌన్సిలర్లు ఉన్నారని, అసభ్య వ్యవహారాలు, ప్రజాపంచాయతీలు సాగుతున్నాయని మహిళలకు ఇబ్బందిగా మారిందన్నారు. పాలనపరమైన కార్యాలయంగా మాత్రమే కొనసాగించాలని కోరారు. చట్ట విరుద్ధంగా ప్రవర్తిస్తున్న ఉద్యోగులను సరెండర్ చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో సందా బిందు, సామల మాధవి, తోట లలిత శారద, పాబోలు స్వాతి పాల్గొన్నారు.

వైశ్యగర్జన పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఆర్యవైశ్యులు

పాల్వంచరూరల్: రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆర్యవైశ్యులకు రావాల్సిన న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పోరాటం చేయాలని వైశ్యగర్జన చైర్మన్ కాసం సత్యనారాయణ అన్నారు. పెద్దమ్మగుడి సముదాయంలోని అమ్మ ఫంక్షన్ హాల్‌లో శనివారం ఆర్యవైశ్య ఆత్మగౌరవ సభ జరిగింది. అక్టోబర్ 1న హైదరాబాద్‌లో జరగనున్న వైశ్యగర్జన సభ ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. ఆర్యవైశ్యుల జనాభాకు అనుగుణంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సీట్లు కేటాయించాలని, ఆర్యవైశ్యుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల సాధన కోసం ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దోసపాటి వెంకటేశ్వర్లు, చలవాది ప్రకాశ్, కొదుమూరి దయాకర్, బిక్కుమళ్ల సుధాకర్, నాళ్ల మనోహర్‌రావు, మహిపతి రామలింగం, ధారా మల్లికార్జున్‌రావు, వల్లపోతు సాయిబాబా, మాయ కృష్ణ ఉమాశంకర్, భానుప్రకాశ్, కొప్పరపు రాము, డొగిపర్తి సతీష్, పెండ్యాల రాజ్యలక్ష్మి, బచ్చు రామ్‌కుమార్, కొండ్లె శ్రీనివాస్, శమంతకమణి, ఇందిర, మౌనిక, నీరజ పాల్గొన్నారు.

సమ్మెలో సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు



పాల్వంచరూరల్: దీక్ష చేస్తున్న సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులు

టేకులపల్లి: సమగ్ర శిక్షా అభియాన్‌లో పని చేస్తున్న సీఆర్‌పీ, ఎంఐఎస్, సీసీఓ, ఐఈఆర్‌పీ, మెసెంజర్ ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. సమగ్ర శిక్షా అభియాన్ జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 4 నుంచి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట సహాయ నిరాకణ రిలే నిరాహార దీక్ష చేస్తుండటంతో మండలంలోని విద్యా శాఖలో ఎంఈఓ, హెచ్‌ఎంలకు ఇబ్బందిగా మారింది. శనివారం టేకులపల్లిలో పని చేస్తున్న ఉద్యోగులు మాట్లాడుతూ.. సమగ్ర శిక్షా అభియాన్‌లో పని చేస్తున్న ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యూలర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, మహిళా ఉద్యోగులకు 180 రోజులు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే 11వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలోకి వెళతామన్నారు. ప్రభుత్వం స్పందించి తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు.

పాల్వంచరూరల్: విద్యాశాఖలో 15 సంవత్సరాలుగా పనిచేస్తున్న సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులను ప్రభుత్వం వెంటనే పర్మనెంట్ చేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పానిశెట్టి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద రిలే నిరాహార దీక్షలు చేస్తున్న సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగుల శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన తరువాత కాంట్రాక్టు ఉద్యోగం అనే పదం ఉండదని చెప్పిన కేసీఆర్ ఆ హామీని విస్మరించారన్నారు. కార్యక్రమంలో మానిపూరి ప్రభాకర్, మాలోతు గాంధీ, మాలోతు ప్రశాంత్, జి.మోహన్, చందు, విజయ్, సురేష్ పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమం ప్రభుత్వానికి తాకట్టు

ఇల్లెందు: ప్రభుత్వానికి ఊడిగం చేస్తున్న సింగరేణి యాజమాన్యం కార్మికుల కష్టాన్ని దోచిపెడుతోందని ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె.సారయ్య, ఎం.ఎల్లయ్యగౌడ్, ఎండీ నజీర్ అహ్మద్‌లు అన్నారు. శనివారం జీఎం కార్యాలయం ఎదుట సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 11వ వేజ్ బోర్డులో 23 నెలల ఏరియర్స్ బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. సీఎస్‌ఆర్, డిఫర్ ట్యాక్సు, ఎమ్మెల్యేకు ప్రత్యేక నిధుల రూపంలో రాష్ట్ర ప్రభుత్వానికి సింగరేణి నిధులు అందజేస్తూ ఖజానాకు గండి కొడుతోందని విమర్శించారు. తక్షణం ఏరియర్స్ చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో బ్రాంచి కార్యదర్శి నజీర్ అహ్మద్, సహాయ కార్యదర్శి కె.వెంకటేశ్వర్లు, గడదాసు నాగేశ్వరరావు, ముస్తాఫా, వీరన్న, సుందర్, గుగులోత్ కృష్ణ, మంచాల వెంకటేశ్వర్లు, సంజీవ చారి, నూనె శ్రీనివాస్, లచ్చిరామ్ తదితరులు పాల్గొన్నారు.

'మైనింగ్'లో శ్రమదోపిడీ



సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేపట్టిన ఏఐటీయూసీ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతలో కీలక భూమిక పోషిస్తున్న మైనింగ్, టెక్నికల్ సిబ్బంది పట్ల సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యం చేస్తోందని, పేరుకే ఫ్రంట్‌లైన్ సూపర్‌వైజర్లుగా పేర్కొంటున్నారే తప్ప, తగిన ప్రాధాన్యం ఇవ్వటం లేదని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య ఆరోపించారు. శనివారం సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట డిమాండ్ల పరిష్కారం కోరుతూ సింగరేణి మైనింగ్ స్టాఫ్, టెక్నికల్ స్టాఫ్ సబ్‌కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో దీక్ష చేపట్టారు. ఈ దీక్షలను ప్రారంభించిన వాసిరెడ్డి మాట్లాడుతూ.. ఉత్పత్తి, లాభాల్లో కీలక పాత్ర పోషిస్తున్న ఫ్రంట్‌లైన్ సూపర్‌వైజర్లకు సరైన సౌకర్యాలు కల్పించకుండా ఇబ్బందులకు గురిచేస్తూ ఏళ్ల తరబడి పదోన్నతులు కల్పించకుండా శ్రమదోపిడీకి పాల్పడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్, ఎస్‌కే సాబీర్‌పాషా, మిర్యాల రంగయ్య, కే.సారయ్య, వైవీ రాము, వీరభద్రయ్య, మద్ది ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

విచ్ఛిన్నం చేసే చర్యలు మానుకోవాలి..

చట్టపరమైన హక్కులు అమలు చేయాలని, న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ప్రజాస్వామ్య పద్ధతిలో జరుగుతున్న ఉద్యమాలను, పోరాటాలను సింగరేణి యాజమాన్యం జీర్ణించుకోలేక పోతోందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా అన్నారు. డిమాండ్ల పరిష్కారం కోరుతూ శనివారం మైనింగ్, టెక్నికల్ సబ్ కమిటీల ఆధ్వర్యంలో సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన దీక్షల శిబిరం టెంటును తొలగించి దౌర్జన్యానికి పాల్పడిన సింగరేణి సెక్యూరిటీ గార్డులు వారికి ఆదేశాలు జారీ చేసిన అధికారుల తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. టెంట్‌ను తొలగించిన సెక్యూరిటీ సిబ్బంది అధికారులతో వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా పాషా మాట్లాడుతూ.. సింగరేణి యాజమాన్యం తీరు మార్చుకోని పక్షంలో గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

ఘనంగా ప్రజాకవి కాళోజీ జయంతి



కొత్తగూడెంఅర్బన్: కాళోజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దిండిగల రాజేందర్ తదితరులు



కొత్తగూడెంరూరల్: త్రివేణి పాఠశాలలో తెలంగాణ భాషా దినోత్సవంలో విద్యార్థులు



పాల్వంచ: కేటీపీఎస్‌లో నివాళులర్పిస్తున్న సీఈ వెంకటేశ్వర్లు

పాల్వంచ: ప్రజా కవి కాళోజీ నారాయణ రావు జయంతిని శనివారం స్థానిక కేటీపీఎస్ 5,6 దశల కర్మాగారంలోని ఎంసీఆర్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ సీఈ వి.వెంకటేశ్వర్లు కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మాట్లాడుతూ,, పేద ప్రజల అభ్యున్నతి కోసం కాళోజీ ఎంతగానో శ్రమించారన్నారు. ఆయన ఆశయాలను సాధించాలని, కార్మికులు సంస్థకు మంచి పేరు తెచ్చేలా కృషి చేయాలన్నారు. ఎస్‌ఈ బి.మోక్షవీర్, ఇంజనీర్లు రాంబాబు, కృష్ణయ్య, ఫసీయుద్దీన్, భాగం రాధకృష్ణ, ఎ.పుల్లారావు, సురేంద్రాచారి పాల్గొన్నారు.

త్రివేణి పాఠశాలలో...

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం త్రివేణి పాఠశాలలో ప్రజాకవి రఘువీర్ నారాయణ్ లక్ష్మీకాంత్ శ్రీనివాస్‌రామ్ రాజా కాళోజి జయంతిని పురస్కరించుకొని తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌సింగ్ మాట్లాడుతూ అక్షర రూపం దాల్చిన ఒక సిరా చుక్క లక్ష మెదళ్ళకు కదిక అని కాళోజి గురించి కొనియాడారు. ఈకార్యక్రమంలో పాఠశాల సీఆర్‌వో కాట్రగడ్డ మురళీకృష్ణ, ప్రిన్సిపాల్ సురేష్, సౌజన్య, క్యాంపస్ ఇన్‌చార్జ్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెంఅర్బన్: కాళోజీ కవితా అక్షరమాల, తెలంగాణ ఉద్యమ ప్రతిధ్వని అని తెలంగాణ మలిదశ ఉద్యమ నేత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్ అన్నారు. కాళోజీ నారాయణరావు 109 వ జయంతిని పురస్కరించుకొని ప్రభుత్వం తెలంగాణ భాషా దినోత్సవాన్ని జరుపుతున్న సందర్భంగా స్థానిక జిల్లా గ్రంథాలయ సంస్థ ఆవరణలో కాళోజీ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాట్లాడుతూ.. కాళోజీ తెలంగాణ ప్రజలను చైతన్యపరిచిన తొలితరం తీరు మహా అద్భుతం, అనిర్వచనియం అన్నారు. రాజకీయ, సాంఘిక, చైతన్యాల సమాహారంగా కవితలు రాస్తూ ప్రజల హక్కులను అడిగిన ప్రజల మనిషి అని కొనియాడారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్, జిల్లా గ్రంథాలయ డైరెక్టర్ మోరే భాస్కర్ రావు, రాజుగౌడ, మహేందర్, జయరాం, జి.మణి మృదుల పాల్గొన్నారు.

కొత్తగూడెంరూరల్: చాతకొండ 6వ బెటాలియన్ క్యాంప్‌లో ప్రజాకవి కాళోజీ నారాయణరావు 109 జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు బి.సీతారాం, ఎం.నాగభూషణం, ఇ.వీరన్న, ఆర్ఐలు, ఆర్‌ఎస్‌ఐలు పాల్గొన్నారు.